సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 6 । ఆగస్టు । 2025



పర్యాటకం.. అభివృద్ధికి దూరం

ప్రకృతి అందాలకు నెలవైన కడెం ప్రాజెక్టు పర్యాటకంగా గుర్తింపు పొందింది. అయితే సరైన సౌకర్యాలు లేక సందర్శకులకు ఇక్కట్లు తప్పడం లేదు. 10లో▸



వన్యప్రాణులను వేటాడితే చర్యలు

వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. వన్‌టౌన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

డీఈవోగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఆదిలాబాద్‌టౌన్‌: ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎఫ్ఏసీ బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. ఇదివరకు డీఈవోగా పనిచేసిన వయోజన విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డిని తప్పించారు. ఈ మేరకు సీఎస్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా ఇప్పటికే ఖుష్బూ గుప్తా ఐటీడీఏ పీవోగా, మున్సిపల్ ప్రత్యేక అధికారిగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ పోస్టుతో ఆమె నాలుగు పోస్టుల్లో కొనసాగనున్నారు.

నియామకం

కైలాస్‌నగర్: సమాచారహక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా జగదీష్ అగర్వాల్, కో ఆర్డినేటర్‌గా డి.సృజన నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల రాఘవేంద్రనాథ్ యాదవ్ ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న ఆయా సంఘాల నాయకులు

కైలాస్‌నగర్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీం పక్కాగా అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇందులో కమిటీ నాయకులు, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్గో ద్వారా రాఖీల బుకింగ్



బుకింగ్ కౌంటర్ ప్రారంభిస్తున్న డీఎం

ఆదిలాబాద్: రాఖీ పౌర్ణమి నేపథ్యంలో అన్నదమ్ములకు రాఖీలు పంపాలనుకునే సోదరీమణుల కోసం ఆర్టీసీ కార్గో కౌంటర్లను ప్రారంభించినట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో కార్గో బుకింగ్‌కౌంటర్ ప్రారంభించారు. రీజియన్ పరిధిలో 29 కౌంటర్లలో రాఖీలు బుక్ చేసుకునే సౌలభ్యం ఉందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బస్టాండ్ కంట్రోలర్ పీఎస్ రెడ్డి, రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సాయన్న,అన్సార్ తదితరులున్నారు.

రెండు ఆస్పత్రులకు నోటీసులు




ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్‌: నిబంధనలు పాటించని రెండు ప్రైవేట్ ఆస్పత్రులకు వైద్యశాఖ అధికారులునోటీసులు జారీచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను మంగళవారం తనిఖీ చేశారు. పట్టణంలోని వెంకటేశ్వర చిల్డ్రన్ హాస్పిటల్, శివప్రియ నర్సింగ్‌హోమ్, సుజాత నర్సింగ్ హో మ్ అండ్ సర్జికల్ ఆస్పత్రులను పరిశీలించారు. నిబంధనలుపాటించని సుజాతనర్సింగ్ హోమ్, శివప్రియ నర్సింగ్ హోమ్ యాజమాన్యాలకు నోటీసులు అందించినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. వారి వివరణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఇందులో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అధికారికంగా జయశంకర్ జయంతి

కైలాస్‌నగర్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణులు, బీసీ సంఘాల నాయకులు, కులస్తులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ శాఖలో సబ్‌డివిజన్ స్థాయి టెండర్లను సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) మాత్రమే చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఉట్నూర్ సబ్ డివిజన్‌లో ఓ కాంట్రాక్టర్‌కు రూ.10లక్షల విలువైన పనులను డివిజనల్ ఇంజినీర్ (డీఈ) స్థాయి అధికారి తన సీరిస్ నంబర్‌పై ఖరారు చేశారు. ఇతర పనుల్లో డీఈకి రూ.5లక్షల్లోపే పనులను అప్పగించే అధికారం ఉంది. అయితే సదరు డీఈకి నిబంధనలన్నీ బలాదూర్‌గా మారాయి. తనకు అనువైన ఓ కాంట్రాక్టర్‌కు తన సీరిస్ నంబర్‌పై ఎలాంటి అధికారం లేకున్నప్పటికీ పెద్ద మొత్తంలో పనులను అప్పగించడం గమనార్హం. దానికి సంబంధించిన అగ్రిమెంట్ కాపీయే ఈ ఫొటోలో ఉన్నది.



టెండర్ల గోల్‌మాల్

- విద్యుత్ శాఖలో అంతా ఇష్టారాజ్యం
- సబ్ డివిజన్ వర్క్స్ దొడ్డిదారిన కేటాయింపు
- తన స్థాయి మించి ఓ డీఈ పనులు అప్పగింత
- అనువైన కాంట్రాక్టర్లకు అందలం
- పాత అగ్రిమెంట్‌పైనే ఎక్స్‌టెన్షన్ ద్వారా పనులు



జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: విద్యుత్ శాఖలో సబ్ డివిజన్ స్థాయి టెండర్లలో పెద్ద మొత్తంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి అధికారులే ఆజ్యం పోస్తున్నారనే విమర్శలున్నాయి. తమ పరిధి కాకపోయినప్పటికీ, తమకు ఆ టెండర్లు ఇచ్చే అధికారం లేకపోయినా కొంత మంది అధికారులు ఇవేమి పట్టించుకోవడం లేదు. ఉట్నూర్ పరిధిలోని సబ్‌డివిజన్ వర్క్స్ కేటాయింపులో చోటు చేసుకున్న అక్రమాలే అధికార దుర్వినియోగానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. గతంలోనూ ఈ డివిజన్‌లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడం, దానిపై సీఎండీ, జేఎండీ స్థాయిలో ఫిర్యాదులు వెళ్లాయి. విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. ఇంత జరిగినా అక్కడ మార్పు రావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బినామీలకు పెద్దపీట..

విద్యుత్ శాఖలో టెండర్లలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా అధికారులే తమ బంధువులను బినామీలుగా రంగంలోకి దించి దొడ్డిదారిన పనులు అప్పగిస్తున్నారనే విమర్శలు ముందునుంచి ఉన్నాయి. పైస్థాయి నుంచి కిందిస్థాయి అధికారుల వరకు కొందరు ఇలా అక్రమాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది.

రేట్లు సరిపోవడం లేదనే సాకు..

విద్యుత్ శాఖ జిల్లా పరిధిలో ఐదు సబ్ డివిజన్లు ఆదిలాబాద్, జైనథ్, ఆదిలాబాద్‌రూరల్, ఇచ్చోడ, ఉట్నూర్ ఉన్నాయి. ఈ సబ్ డివిజన్ల పరిధిలో 30 మంది గుర్తింపు పొందిన కాంట్రాక్టర్లు ఉన్నారు. గతంలో టెండర్లు జరిగినప్పుడు రూ.20లక్షల విలువైన పనులను ఒక్కొక్కరికి అప్పగించారు. ఇది ఎస్ఈ స్థాయిలోనే కేటాయించారు. ఆ పనులు పూర్తయిన తర్వాత మళ్లీ వారికి వివిధ పనులకు సంబంధించి ఎక్స్‌టెన్షన్ ఇస్తారు. అదికూడా ఎస్ఈ స్థాయిలోనే జరగాలి. ఆ పరిమితి పూర్తి చేసుకున్న వాటికి సంబంధించి మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహిస్తారు. ఇలా సబ్ డివిజన్ల పరిధిలో కాంట్రాక్టర్ల గుర్తింపునకు సంబంధించి మళ్లీ టెండర్లు నిర్వహించాలి. ఆ టెండర్లలో పాత కాంట్రాక్టర్లు కూడా పాల్గొనవచ్చు. కొత్త కాంట్రాక్టర్లకు అవకాశం లభిస్తుంది. అయితే ఇక్కడ పాత కాంట్రాక్టర్లు కొత్త కాంట్రాక్టర్లకు చెక్ పెట్టేందుకు ఎత్తుగడ అవలంభించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా వర్క్స్‌కు సంబంధించి రేట్లు తమకు సరిపోవడం లేదని, తాము ఆ పనులను చేపట్టమంటూ టెండర్లకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇదంతా విద్యుత్ శాఖ అధికారులకు, పాత కాంట్రాక్టర్లకు అంతర్గతంగా లోపాయికారి ఒప్పందంతోనే జరుగుతుందనే ప్రచారం ఉంది.

ఆ ముసుగులో పనులు అప్పగింత..

ఇలా పాత కాంట్రాక్టర్లు తమకు రేట్లు సరిపోవడం లేదని టెండర్లకు దూరంగా ఉండటం, దానికి సంబంధించి పైస్థాయిలో అధికారులకు నివేదికలు పంపడంతో ప్రస్తుతం సబ్ డివిజన్ స్థాయి కొత్త టెండర్లు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. తద్వారా ఆయా వర్క్స్‌పై దీని ప్రభావం పడింది. కాంట్రాక్టర్లు రేట్లు సరిపోవడం లేదని పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదనే సాకుతో పాత కాంట్రాక్టర్లకు పాత అగ్రిమెంట్ల పైనే మళ్లీ కొత్త పనులను ఎక్స్‌టెన్షన్ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నా దృష్టికి రాలేదు..



సబ్ డివిజన్ స్థాయి వర్క్స్ టెండర్లు ఎస్ఈ స్థాయిలోనే జరుగుతాయి. ఉట్నూర్ డివిజన్‌లో ఆ పనులు డీఈ ఇచ్చినట్లు నా దృష్టికి రాలేదు. జిల్లాలో సబ్ డివిజన్ల పరిధిలో కొత్త టెండర్లకు సంబంధించి మూడుసార్లు కాల్‌ఫర్ చేసినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రధానంగా వారు రేట్లు సరిపోవడం లేదని చెబుతున్నారు. దీంతో పనులు నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఇటు ప్రభుత్వం ఆ పనులను చేపట్టాలని చెప్పడంతో కొంత మంది కాంట్రాక్టర్లకు ఎక్స్‌టెన్షన్ ద్వారా ఇవ్వడం జరుగుతుంది.

– జేఆర్ చౌహాన్, ఎస్ఈ, ఆదిలాబాద్

‘స్పోర్ట్స్’లో కీచకపర్వం

- అమ్మాయిలపై లైంగిక వేధింపులు
- గతంలో ఓ శిక్షకునిపై వేటు
- తాజాగా మరో కోచ్‌పై పోక్సో కేసు
- క్రీడా పాఠశాలపై కరువైన పర్యవేక్షణ



జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల

ఆదిలాబాద్: ఓ వైపు కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటుంటే క్షేత్రస్థాయిలో మాత్రం భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడా శిక్షణలో తర్ఫీదు ఇచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా మూడు క్రీడా పాఠశాలలను నెలకొల్పారు. ఒకటి హకీంపేట, రెండోది కరీంనగర్‌లో ఉండగా, మరొకటి జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 2016లో ఏర్పాటు చేశారు. అయితే మొదటి నుంచి వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన స్పోర్ట్స్ స్కూల్ ప్రతిష్ట క్రమంగా మసకబారుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. తరచూ ఏదో వివాదంతో వార్తల్లో నిలుస్తున్న ఈ క్రీడా పాఠశాలలో తాజాగా ఓ విద్యార్థినిపై శిక్షకుడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోక్సో కేసు నమోదు కావడం గమనార్హం. క్రీడా శిక్షణ అందించాల్సిన శిక్షకులపై ఇలాంటి ఆరోపణలు రావడం, కేసులు నమోదు అవుతుండడం మిగతా విద్యార్థులపై ప్రభావం చూపే అవకాశాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆది నుంచీ అదే తీరు..

- 2023 సంవత్సరంలో ఈ పాఠశాలలో అథ్లెటిక్స్‌లో శిక్షణ అందించే శిక్షకుడు ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తొలుత విషయాన్ని గోప్యంగా ఉంచిన అధికారులు తర్వాత బయటకు పొక్కడంతో శిక్షకుడిపై వేటు వేశారు.
- గతంలో ఈ పాఠశాలలో ఓ విద్యార్థినిపై ఓ విద్యార్థి వేధింపులకు దిగాడని ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. విషయాన్ని బయటకు రాకుండా అమ్మాయి మానసిక స్థితి సరిగా లేదని నాడు అధికారులు, సిబ్బంది చెప్పుకొచ్చారు.
- తాజాగా బాక్సింగ్ నేర్పించే శిక్షకునిపై లైంగిక ఆరోపణలు చేస్తూ ఓ బాలిక తల్లిదండ్రులు జూలై 27న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సదరు శిక్షకునిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు.

క్రీడాకారులు, తల్లిదండ్రుల్లో భయాందోళనలు..

క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తే తమ పిల్లలు చదువుతోపాటు మంచి క్రీడాకారులుగా ఎదుగుతారనే ఆలోచనతో తల్లిదండ్రులు ఇక్కడ చేర్పించేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాబోధన చేస్తూ జూడో, అథ్లెటిక్స్, రెజ్లింగ్, బాక్సింగ్ వంటి క్రీడల్లో శిక్షణ అందిస్తున్నారు. అయితే కొంతమంది శిక్షకుల అనుచిత ప్రవర్తన కారణంగా విద్యార్థులు పూర్తిస్థాయిలో అటు చదువుపై, ఇటు క్రీడలపై దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనల కారణంగానే పలువురు విద్యార్థులు టీసీలు తీసుకుంటున్నారనేది బహిరంగ రహస్యమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కరువైన పర్యవేక్షణ..

ఇంత జరుగుతున్నా పట్టించుకోని సంబంధిత అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. డీఎస్ఏ పరిధిలో, క్రీడా పాఠశాల ప్రాంగణంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా సమాచారం బయటకు రాకుండా సిబ్బంది, అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మెమో జారీ చేశాం..

బాక్సింగ్ శిక్షకునికి మెమో జారీ చేశాం. అతని వివరణ తీసుకున్నాం. అంతర్గతంగా విచారణ జరుపుతున్నాం. మా నివేదికతో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ నివేదికను కలెక్టర్‌కు అందిస్తాం. వారి ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం.

– జక్కుల శ్రీనివాస్, డీవైఎస్‌వో

వేగ నియంత్రణకు పోలీస్ కటౌట్లు

- జాతీయ రహదారిపై రెండు చోట్ల ఏర్పాటు
- ఎస్పీ అఖిల్ మహాజన్



జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన కటౌట్లు

ఆదిలాబాద్‌టౌన్‌: జాతీయ రహదారిపై వేగాన్ని నియంత్రించేందుకు, రోడ్డు ప్రమాదాలు అరికట్టడానికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో కటౌట్లు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. జాతీయ రహదారిపై హాట్‌స్పాట్‌ల వద్ద పోలీసు వాహనం, ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో కూడిన కటౌట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి, నేరడిగొండ మండలం బంధం ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాటిని చూసి వాహనదారులు బ్రేక్‌లు వేస్తున్నారని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్నారని తెలిపారు.

ఆదివాసీ దినోత్సవానికి ఆహ్వానం

ఈనెల 9న నిర్వహించే ఆదివాసీ దినోత్సవానికి హాజరు కావాలని ఆదివాసీ సంఘాల నాయకులు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఇందులో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఆదివాసీ సంఘాల నాయకులు గోడం గణేశ్, పుర్క బాపురావు, జయవంత్‌రావు, పెందూర్ దాదిరావు, గేడం రేణుకబాయి, వెట్టి మనోజ్, ఉయిక ఇంద్రబాయి, మడావి ఆనంద్‌రావు, సలాం వరుణ్, సిడాం శంభు,తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బజార్‌హత్నూర్: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఇంటర్మీడియెట్ బోర్డు స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ సెక్రెటరీ అకడమిక్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో ప్రిన్సిపాల్ సునిల్, అధ్యాపకులు అశోక్‌రెడ్డి, హైమద్, జ్ఞానేశ్వర్, గంగాధర్, రామారావ్, నవీన్‌రెడ్డి, వనజ పాల్గొన్నారు.

నేటి నుంచి ‘సర్వేయర్’ అప్రెంటిస్‌షిప్

- ఒక్కో సర్వేయర్‌కు 15 మంది శిక్షణ అభ్యర్థులు అటాచ్



అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్న అధికారులు (ఫైల్)

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమల్లో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఎంపిక చేసిన వారికి 56 రోజుల పాటు జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో శిక్షణ ఇచ్చింది. రాత పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ఈనెల 4నుంచి అప్రెంటిస్‌షిప్ అందించాలని తొలుత నిర్ణయించింది. అయితే ఇప్పటివరకు ఫలితాలు వెల్లడించలేదు. అయినా పరీక్షకు హాజరైన అభ్యర్థులందరికీ అప్రెంటిస్‌షిప్ అందించాలని నిర్ణయించింది. ఆ దిశగా జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారులు చర్యలు చేపట్టారు. గత నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించిన పరీక్షకు హాజరైన 129 మందికి బుధవారం నుంచి అప్రెంటిషిప్ శిక్షణ ఇవ్వనున్నారు. మండల సర్వేయర్ల పరిజ్ఞానం, వారి పనితీరు ఆధారంగా ఒక్కో సర్వేయర్‌కు 15 నుంచి 21 మంది అభ్యర్థులను కేటాయించారు. ఈమేరకు వారిని మంగళవారం కార్యాలయానికి పిలిపించారు. ఏ మండలంలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారనే వివరాలు సేకరించారు. తదనుగుణంగా వారిని జిల్లాలో పనిచేస్తున్న 10 మంది సర్వేయర్లకు అటాచ్ చేశారు. మంగళవారం రాత్రి వరకు ఈ ప్రక్రియ పూర్తికాగా అభ్యర్థులకు వాట్సాప్ ద్వారా వారి సర్వేయర్ పేరు, మండలం వంటి సమాచారం అందించనున్నారు. పరీక్ష ఫలితాలు ప్రకటించకుండానే అభ్యర్థులందరికీ అప్రెంటిస్‌షిప్ ఇవ్వనుండటంతో అందరినీ విధుల్లోకి తీసుకుంటారా లేక ఫలితాల అనంతరం ఎవరినైనా రిజెక్ట్ చేస్తారా అనే ఆందోళన వారిలో వ్యక్తమవుతుంది. ఈ విషయమై జిల్లా సర్వేల్యాండ్ రికార్డ్ ఏడీ రాజేందర్‌ను ‘సాక్షి’ సంప్రదించగా.. ప్రభుత్వ ఆదేశాల మేరకు పది మంది సర్వేయర్లకు శిక్షణ అభ్యర్థులను అటాచ్ చేశామని తెలిపారు. తదుపరి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ రాజర్షి షా



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

తాంసి: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, పీఏసీఎస్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. తరచూ విధులకు గైర్హాజరవుతున్న జూనియర్ అసిస్టెంట్ సాయితేజకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అనంతరం సహకార సంఘం కార్యాలయంలో ఎరువుల నిల్వలు పరిశీలించారు. స్టాక్ రికార్డులు తనిఖీ చేశారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, డీసీవో మోహన్, ఏవో రవీందర్, వైద్యసిబ్బంది నర్మద, సుజాత, సహకార సంఘం సీఈవో కేశవ్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన



జాబ్‌మేళాకు భారీగా హాజరైన నిరుద్యోగులు

కైలాస్‌నగర్:నిరుద్యోగ యువతకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో టాస్క్ సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు స్పందన లభించింది. జిల్లాయంత్రాంగం ఆధ్వర్యంలో ఎస్టీయూభవన్‌లో నిర్వహించిన మేళాకు జిల్లా నలుమూలల నుంచి నిరుద్యోగులు భారీగా తరలివచ్చారు. ఐటీ, నాన్ ఐటీకి సంబంధించిన 34 కంపెనీల ప్రతినిధులు హాజరై పదోతరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతల ఆధారంగావారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. నైపుణ్యం ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించి మాట్లాడారు. ప్రజావాణిలో అందుతున్న వినతుల నేపథ్యంలో జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభంలో వేతనం తక్కువ ఉన్నా వృత్తినైపుణ్యం పెంపొందించుకుంటే మంచి ప్యాకేజీ పొందవచ్చన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఐఈవో జాదవ్ గణేశ్ కుమార్, డీడబ్ల్యూవో మిల్కా,పరిశ్రమలశాఖ జీఎం పద్మభూషణ్ రాజు, మున్సిపల్ కమిషనర్ సీవీఎస్.రాజు, డీవైఎస్‌వో శ్రీనివాస్, డీఎల్‌పీవోలు ఫణిందర్‌రావు, ప్రభాకర్‌రావు, స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ప్రవీణ్‌కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారమేది?

- ఎన్ఆర్సీకి బడ్జెట్ సమస్య
- సరుకులు లేక సిబ్బంది అవస్థలు
- చిన్నారులకు అందని న్యూట్రీషియన్ ఫుడ్



ఎన్ఆర్సీలో చిన్నారులతో తల్లిదండ్రులు

ఆదిలాబాద్‌టౌన్‌: వివిధ రుగ్మతలతో బరువు పెరగని పిల్లలను జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో గల న్యూట్రీషియన్ రీహాబిటేషన్ సెంటర్ (ఎన్ఆర్సీ)లో చేర్పిస్తారు. వీరికి వివిధ రకాల పోషకాహారంతో పాటు వైద్య చికిత్స అందజేస్తారు. ఆయా గ్రామాల నుంచి అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు పిల్లలను ఇక్కడ చేర్పించి వారి ఆరోగ్యంపై దృష్టి సారిస్తారు. ఎత్తుకు తగ్గ బరువు ఉండని ఐదేళ్లలోపు పిల్లల్ని గుర్తిస్తారు. ఎన్ఆర్సీలో 14 రోజుల పాటు పౌష్టికాహారం అందజేస్తారు. అయితే రెండు నెలలుగా ఆ సెంటర్‌లో పిల్లలకు పోషకాహారం అందడం లేదు. బడ్జెట్ లేకపోవడంతో సిబ్బంది పిల్లలకు రిమ్స్‌లో రోగులకు అందించే భోజనం పెడుతున్నారు. పప్పు, అన్నం, పాలు తప్పా మరే పౌష్టికాహారం అందడం లేదని ఎన్ఆర్సీలో పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంటి వద్ద కూడా ఈ భోజనం తీసుకోవచ్చని పేర్కొంటున్నారు.

బడ్జెట్ లేక తంటాలు..

ఈ సెంటర్‌లో ప్రస్తుతం 13 మంది పిల్లలు చికిత్స పొందుతున్నారు. ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఆయాలు, ఒక కుక్, ఒక న్యూట్రీషనిస్ట్ పనిచేస్తున్నారు. వీరంతా కాంట్రాక్ట్ పద్ధతిన కొనసాగుతున్నారు. బడ్జెట్ లేక వీరికి నెల వేతనం సైతం అందలేదని చెబుతున్నారు. నెలకు చిన్నారులకు భోజనం పెట్టేందుకు రూ.15వేలు ఖర్చవుతుందని, అయితే నెల రోజులుగా బడ్జెట్ లేకపోవడంతో తమ డబ్బులతోనే సరుకులు తెచ్చి పిల్లలకు పెడుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు.

అమలుకు నోచుకోని మెనూ



చిన్నారులకు అందించాల్సిన మెనూ

ఎన్ఆర్సీలో నెల వయస్సు చిన్నారుల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలను చేర్పిస్తారు. పాలు, గుడ్లు, ఉప్మా, నెయ్యి, పోహా, సేమియా, ముర్కులు, దొడ్డు రవ్వ, హల్వా, కిచిడి, అన్నిరకాల కూరగాయలతో తయారు చేసిన భోజనం అందించాల్సి ఉంటుంది. అలాగే ఆలు రైస్, దాల్‌రైస్, సాబుదాన, రాగిజావ, టమాట రైస్, బెల్లం రైస్, వెజిటేబుల్‌రైస్ ఇలా అనేక రకాల పోషకాలు కూడిన భోజనాన్ని పెట్టాల్సింది. అయితే రెండు నెలలుగా సరిపడా సరుకులు లేకపోవడంతో ఉన్న వాటితోనే నెట్టుకొస్తున్నారు. వారం రోజులుగా పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కనీసం అక్కడ బియ్యం కూడా లేవని సిబ్బంది చెబుతున్నారు. కేవలం పాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రెండు గంటలకోసారి పిల్లలకు వివిధ రకాల ఆహార పదార్థాలు అందించాల్సి ఉంటుంది. అయితే సరుకులు నిండుకుండడంతో రిమ్స్‌లో రోగులకు పెట్టే పప్పు, అన్నంనే చిన్నారులకు అందించాల్సి వస్తోంది. దీంతో వారిలో బరువు కూడా పెరగడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ రాలేదు..

ఎన్ఆర్సీకి సంబంధించి బడ్జెట్ రాలేదు. దీంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న మాట వాస్తవమే. బియ్యంతో పాటు ఇతర సరుకులు లేవు. రిమ్స్‌లో రోగులకు అందిస్తున్న భోజనంలో నుంచి పిల్లలకు పెడుతున్నాం. మా సొంత ఖర్చుతో సరుకులు తీసుకొచ్చి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపడతాం.

– శ్రీనివాస్‌చారి, ఎన్ఆర్సీ మెడికల్ ఆఫీసర్

క్లుప్తంగా

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గీతేశ్వర్ కొంత కాలంగా విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. వెకిలిచేష్టలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. సదరు విద్యార్థినుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

ఇంద్రవెల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దొడందా గ్రామంలోని మెస్రం తుల్సిరాం అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా ఎర్తింగ్ వైర్‌కు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. కాగా విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఎర్తింగ్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఎద్దు మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై

కాసిపేట: మండలంలోని కోమటిచేను గ్రామంలో రాంటెంకి శివరాంపై దాడి చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన జాడి రవి, అతని కుమారుడు జాడి సాయికుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గత నెల 25న రాత్రి శివరాంపై కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

స్కూల్ విద్యార్థుల ఆటో బోల్తా

- ఇద్దరికి స్వల్పగాయాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలో పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. నారాయణపూర్ నుంచి మంగళవారం తొమ్మిది మంది స్కూల్ విద్యార్థులను ఎక్కించుకున్న ఆటో బావురావుపేట సమీపంలోని ఆస్సిసి పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు విద్యార్థులను బయటకు తీశారు. ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలు కావడంతో 108కు సమాచారం అందించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

ఆటో టైర్లు చోరీ



టైర్లు చోరీకి గురైన ఆటో

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్‌లో సోమవారం రాత్రి ఆటో టైర్లు చోరీకి గురైనట్లు వాహన యజమాని ఏముర్ల రాకేష్ తెలిపారు. ఎప్పటిలాగే తన ఇంటి ముందు పార్కింగ్ చేశానని, రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో మూడు టైర్లను అపహరించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నకిలీ బాబాలపై కేసులు

ఆదిలాబాద్‌టౌన్: అమాయక ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్న నకిలీ బాబాలపై కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా నకిలీ బాబాల భరతం పట్టేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఏకకాలంలో జిల్లా వ్యాప్తంగా దాడులు జరిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన జుబేర్, ఖానాపూర్‌కు చెందిన ఉస్మాన్‌లపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి తావీతులు, విభూది, నిమ్మకాలు, తదితర వాటిని ఇస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బేల, ఇచ్చోడలో ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి వరకు ఈ దాడులు జరిగాయి.

పర్యాటకం.. అభివృద్ధికి దూరం

- కడెం.. సహజ సౌందర్య నిలయం
- ఏడాది పొడవునా పర్యాటకుల రాక
- శిథిలావస్థకు డీలక్స్ బోటు
- మూలనపడిన స్పీడ్ బోటు
- పట్టించుకోని పర్యాటక శాఖ



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు (ఫైల్)



మరమ్మతులకు నోచుకోని స్పీడ్ బోటు

కడెం: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయంగా నిలిచిన కడెం ప్రాజెక్టు, రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. 2010లో పర్యాటక శాఖ బోటింగ్‌ను ప్రవేశపెట్టడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరిగింది. ఈ అందమైన ప్రాజెక్టును తిలకించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. అయితే, పెరిగిన పర్యాటకుల సంఖ్యకు తగ్గ సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కడెంను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా..

2010లో బోటింగ్ ప్రవేశపెట్టినప్పటి నుంచి కడెం ప్రాజెక్టు పర్యాటక రంగంలో గణనీయమైన ఆదరణ పొందింది. 2015లో 12 విడిది గదులు, రెస్టారెంట్‌తో కూడిన హరిత రిసార్ట్స్‌ను ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రస్తుతం హరిత రిసార్ట్స్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. పర్యాటకుల విడిది కోసం ఒక రిసార్ట్, రెండు లాడ్జీలు అందుబాటులో ఉన్నాయి. ఈ సౌకర్యాలతో కడెం రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందింది.

అభివృద్ధి లేక ఇబ్బందులు..

కడెం బోటింగ్ యూనిట్‌లో ఒక డీలక్స్ బోటు, స్పీడ్ బోటును ప్రవేశపెట్టినప్పటికీ, సౌకర్యాల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. గతంలో రూ.30గా ఉన్న బోటింగ్ టికెట్ ధరను రూ.50కి పెంచారు, కానీ సౌకర్యాలు మెరుగుపరచకపోవడంతో ఆదాయం గణనీయంగా తగ్గింది. స్పీడ్ బోటు మోటారు చెడిపోయి సంవత్సరాలు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో అది మూలన పడింది. డీలక్స్ బోటు శిథిలావస్థలో ఉన్నప్పటికీ, తాత్కాలిక మరమ్మతులతో నడుపుతున్నారు. బోటింగ్‌కు 16 మంది లేదా రూ.600 చెల్లించాల్సిన నిబంధన వల్ల చాలా మంది పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.



బోటింగ్ పాయింట్ వద్ద పర్యాటకులు

శిథిలావస్థలో సౌకర్యాలు..

కడెం బోటింగ్ స్టాండ్‌ను గతంలో రాత్రికి రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా సోమశీలకు తరలించారు, దాని స్థానంలో పాత స్టాండ్‌ను వదిలేశారు. ప్రస్తుతం ఈ స్టాండ్ కూడా శిథిలావస్థకు చేరింది. బోటింగ్ సిబ్బంది తాత్కాలికంగా తాళ్లు, తెప్పలతో దాన్ని నడిపిస్తున్నారు, దీంతో పర్యాటకులకు ప్రమాద భయం పొంచి ఉంది. సౌకర్యాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల గతంలో లక్షల్లో వచ్చిన ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది.

ప్రాజెక్టు అందాలు బాగున్నాయి



కడెం ప్రాజెక్టును విజిట్ చేశాం. ప్రకృతి సిద్ధమైన కడెం ప్రాజెక్టు అందాలు బాగున్నాయి. బోటింగ్ చేశాం. ఇక్కడ ఒకటే బోటు ఉంది. స్పీడ్ బోటుతో పాటు పైడల్ బోటు లాంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– దివ్య, పర్యాటకురాలు, రాజమండ్రి

అభివృద్ధి చేయాలి



మిత్రులతో కలిసి కడెం ప్రాజెక్టు సందర్శనకు వచ్చాం. కడెం ప్రాజెక్ట్, పరిసర ప్రాంతాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి. నీటి మధ్యలో ఉన్న ఐ ల్యాండ్ వరకు బోటును తీసుకెళ్తే బాగుంటుంది. ప్రాజెక్ట్‌లో వాటర్ గేమ్స్ లాంటివి ఏర్పాటు చేయాలి.

– చంద్రశేఖర్, పర్యాటకుడు, విజయవాడ

శిశుమందిరాల్లో విద్యతోపాటు క్రమశిక్షణ

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశం పట్ల భక్తిభావన పెంపొందించడంలో సరస్వతి శిశు మందిరాలు విశేష కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని కిసాన్ గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యాపీఠం ప్రాంత అధ్యక్షుడు తిరుపతిరావు, సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రాంత శైక్షనిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దుర్గం రాజేశ్

దండేపల్లి: నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన నేతకానీ మహర్ సంక్షేమ సంఘం మండల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ప్రకటించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రత్యేక స్థానం కల్పించాలని, స్థానిక ఎన్నికల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాశ్, నర్సయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యువరాజు, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకులు శ్రీనివాస్, రాములు, రాజలింగు, పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

గిత్తే కార్తీక్‌కు ఆర్థికసాయం



శివాజీ ప్రతిమ బహూకరిస్తున్న సీడీ చౌహాన్

కెరమెరి: హిమాచల్ ప్రదేశ్‌లోని స్పీటీ వ్యాలీలో ఈ నెల 9నుంచి 19 వరకు నిర్వహించే మౌంట్ యూనమ్ పర్వతారోహనకు కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని కెలికే గ్రామానికి చెందిన మౌంటేనీయర్ గిత్తే కార్తీక్ ఎంపికయ్యాడు. సికింద్రాబాద్‌కు చెందిన గ్లోబల్ హిందూ ఫెడరేషన్, ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ సీడీ చౌహాన్ మంగళవారం ఛత్రపతి శివాజీ ప్రతిమతో పాటు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. సాహసయాత్ర పూర్తి చేసుకున్నాక మరో రూ.30 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. కాగా కార్తీక్ హైదరాబాద్‌లోని ఏఐఎంఎస్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ మౌంటనీరింగ్ కోర్సును గతంలో పూర్తి చేశాడు. ఎన్నో సాహస కృత్యాల్లో పాల్గొని అవార్డులు సొంతం చేసుకున్నాడు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి భవానీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఈ నెల 3న ఓ యువకుడిపై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడు పంగ శ్రీధర్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గద్దెరాగిడికి చెందిన ఊటూరి హరీష్ భవానీ బార్ దగ్గర ఉండగా అక్కడే ఉన్న శ్రీధర్ తనకు మద్యం ఇప్పించాలని కోరగా నిరాకరించడంతో మహేందర్, తిరుపతి అనే మరో ఇద్దరు స్నేహితులతో కలిసి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీధర్‌ను అరెస్టు చేసి అతనిపై రౌడీషీట్‌కు కూడా ఓపెన్ చేశామని, పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



నీలిమ (ఫైల్)

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై మజారొద్దీన్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని భగవంతంవాడకు చెందిన గోపు సత్య నారాయణ, భారతమ్మ దంపతుల కుమార్తె నీలిమ (37)కు గద్దెరాగడికి చెందిన లారీ డ్రైవర్ మానేం రాజేందర్‌తో వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. సదరు మహిళ కొంతకాలంగా కడుపు నొప్పి, గర్భసంచి సమస్యలతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఇటీవల తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 3న పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మహిళ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..



గణేశ్ (ఫైల్)

దండేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు నంబాల గ్రామానికి చెందిన కొండ గణేశ్ (32), ప్రవళిక దంపతులు కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. ఇద్దరూ కష్టపడి పనిచేస్తున్నా కుటుంబ అవసరాలకు డబ్బులు చాలడం లేదని గణేశ్ పలుమార్లు భార్యతో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈక్రమంలో మంగళవారం కూలీ పని నిమిత్తం ప్రవళికను బైక్‌పై తీసుకెళ్లి గ్రామ సమీపంలోని పత్తిచేను వద్ద దింపి వెళ్లాడు. మధ్యాహ్నం నంబాల బ్రిడ్జివద్ద పురుగుల మందు తాగి విషయాన్ని సోదరుడు రమేశ్‌కు ఫోన్‌చేసి చెప్పడంతో వెంటనే లక్సెట్టిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రైలు కిందపడి ఒకరు..

కాగజ్‌నగర్‌టౌన్: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని కాపువాడకు చెందిన మహ్మద్ షబ్బీర్ (52)మద్యానికి బానిసై ఇంట్లో కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం తెల్లవారు జామున రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బెల్లంపల్లి నుంచి బల్లార్షాకు వెళ్ళే గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

భుక్తాపూర్‌లో యువతి..

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఉట్నూర్‌కు చెందిన మౌనిక (25) ఆదిలాబాద్ పట్టణంలోని ఓ చెప్పుల దుకాణంలో పనిచేస్తూ భుక్తాపూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. సాయంత్రం షాపు నుంచి ఇంటికి వెళ్లిన యువతి ఉరేసుకుని అఘాయిత్యానికి పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..



కార్తీక్ (ఫైల్)

మందమర్రిరూరల్: భార్య కాపురానికి రావడం లేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఏఎస్సై మజీద్‌ఖాన్ తెలిపిన వివరాల మేరకు మందమర్రిలోని రెండవ జోన్‌కు చెందిన సింగరేణి కార్మికుడు శనిగారపు కార్తీక్ (30)కు హనుమకొండకు చెందిన లాస్యతో 2018లో వివాహమైంది. దంపతులకు కుమారుడు ఆర్యన్ (7), కూతురు ఆరాధ్య (5) ఉన్నారు. కుటుంబంలో గొడవలు జరగడంతో నెలరోజుల క్రితం లాస్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో మంగళవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని అన్న సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కడెం కాలువలో గుర్తుతెలియని మృతదేహం

దస్తురాబాద్: కడెం ఎడమ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మల్లాపూర్ గ్రామ సమీపంలోని కడెం ఎడమ కాలువలోని ముళ్లపొదల్లో మంగళవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. పూర్తిగా కుళ్లిపోయి ఉందని, మృతునికి 45 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎరుకల సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఓదెలు



నియామకపు పత్రంతో ఓదెలు

రామకృష్ణాపూర్: ఎరుకల ప్రజా సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన రేవెల్లి ఓదెలును ఎన్నుకున్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లో జరిగిన సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి నియామకపత్రం అందజేశారు. ఎరుకల ప్రజల అభివృద్ధి కోసం, ఎరుకల జాతి చైతన్యం కోసం తనవంతు కృషి చేస్తానని ఓదెలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన హాకీ క్రీడాకారులు

ఆదిలాబాద్: జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికై నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి తెలిపారు. ఆదిలాబాద్ ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలకు చెందిన కొడప ప్రదీప్, వెట్టి సుదర్శన్ ఎంపికయ్యారని, ఈ నెల 12 నుంచి పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

ఒకరిపై గంజాయి కేసు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి)లో ఒకరిపై గంజాయి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గ్రామానికి చెందిన పరశురాం తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేసినట్లు తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు నిర్వహించగా 23 గంజాయి మొక్కలు లభ్యమైనట్లు తెలిపారు. మొక్కలను ధ్వంసం చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అల్లుడిని హతమార్చిన అత్త

- కర్రతో తలపై బాది గొంతునులిమి హత్య
- ముధోల్ మండలంలోని తరోడలో ఘటన



షేక్ నజీమ్ మృతదేహం

తానూరు(ముధోల్): అత్త చేతిలో అల్లుడు హతమైన సంఘటన నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని తరోడలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమాయత్‌నగర్‌కు చెందిన షేక్‌నజీమ్(45) కుటుంబం పదేళ్ల క్రితం ముధోల్ మండలంలోని తరోడలో నివాసం ఉంటోంది. ఇటుకబట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. నజీమ్ అత్తగారైన రహీమున్నీసా వారితో కలిసి ఉంటోంది. వర్షాకాలం కావడంతో ఇటుకల తయారీ పనిలేక పోవడంతో మృతుని భార్య షేక్ సాహెబి ఈనెల 2న శనివారం మహారాష్ట్రలోని శివాని గ్రామానికి మేస్త్రీ పనికోసం వెళ్లింది. ఈ నెల 4న తెల్లవారు జామున నజీమ్ మద్యం సేవించి వచ్చి అత్తను లైంగికంగా వేధించడమే కాకుండా ఆమెపై చేయి చేసుకున్నాడు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు మద్యం మత్తులో ఉన్న నజీమ్ మళ్లీ ఆమెతో గొడవపడడంతో కర్రతో తలపై దాడిచేసి గొంతునులిమి హత్య చేసింది. మంగళవారం ఉదయం స్థానికులు అందించిన సమాచారం సీఐ మల్లేశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య షేక్ సాహెబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలు రహీమున్నీసాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కూనారపు వంశీ(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అందుగుల పేట మేడారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం రాత్రి 10.30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో కూనారపు వంశీ(32) మృతిచెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్‌కు చెందిన వంశీ తన భార్య స్వాతితో కలిసి ద్విచక్ర వాహనంపై అత్తగారి ఊరైన తాండూర్‌కు వెళ్తున్నాడు. అందుగుల పేట వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా.. వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. వంశీకి భార్య స్వాతి, కుమారుడు ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడు..



మల్లయ్య (ఫైల్)

బజార్‌హత్నూర్: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కాండ్లి గ్రామానికి చెందిన పట్ల మల్లయ్య (60) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. సోమవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని భార్య పట్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నేరడిగొండ: మండలంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్చోడ మండలం సల్యాద గ్రామానికి చెందిన చిక్రం సోమేష్ (23) మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఇచ్చోడ మండలం సల్యాదకు చెందిన చిక్రం సోమేష్, తొడసం హన్మంతు ద్విచక్ర వాహనంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాయాదరికి వెళ్లి వస్తుండగా ఆరేపల్లి–కొరటికల్ జాతీయ రహదారి మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. చిక్రం సోమేష్ అక్కడికక్కడే మృతి చెందగా తొడసం హన్మంతుకు తీవ్రగాయాలయ్యాయి. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల వేటగాళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా పది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టి నాలుగు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి ఒక డబుల్ బోర్‌గన్, ఒక ఎయిర్‌గన్, జింక కొమ్ములతో కూడిన తల, రెండు జింక కొమ్ములు, కత్తులు, టార్చ్‌లైట్లు, వేట సామగ్రి, వైర్లు, బరిసెలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1, మావల పోలీసు స్టేషన్‌లో 2, తాంసి పోలీసు స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదిలాబాద్ పట్టణంలోని పంజేషా మొహల్లాకు చెందిన షోయబ్ అఫ్జల్ వద్ద ఒక డబుల్ బోర్‌గన్, జింక తల, రెండు జింక కొమ్ముల ముక్కలు, వేటకు ఉపయోగించిన సామగ్రి, కత్తులు, జాకెట్లు, షూలు లభించినట్లు చెప్పారు. మావల మండలంలోని వాగాపూర్‌కు చెందిన ఆత్రం మారుతి, ఆత్రం భీంరావు వద్ద 50 మీటర్ల జీవైర్, నైలాన్ మెష్, జంతువులను వేటాడే సామగ్రి, ఒక ఈటె, ఎలక్ట్రిక్ వైర్ లభించినట్లు తెలిపారు. తాంసి మండలంలోని ఘోట్కురికి చెందిన షేక్ షరీఫ్ వద్ద ఎయిర్‌గన్ లభించినట్లు పేర్కొన్నారు. వారిపై ఆయా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, మావల సీఐ కర్రె స్వామి, ఎస్సై ఇసాఖ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.